# గడి - నుడి

అన్ని సుఖాల్లోకీ గొప్ప సుఖం చలికాలంలో వేణ్ణీళ్ళతో స్నానం చేయడం. అందుకే ఉదయం వేళ ఒకపట్టాన నేను బాత్రూమ్ వదిలి రాను. నాకు కవిత్వం రాదు కాని, వచ్చుంటే ఓ డజను కవితల్ని బాత్‌రూమ్‌లోనే అల్లేసి ఉందును.

సరిగ్గా అలాంటి సమయాన - బాత్‌రూమ్ తలుపు చప్పుడయితే - "ఎవరూ?" అన్నాను.

"వెంకటేశ్వర్లు మామయ్య నిన్ను తొందరగా రమ్మంటున్నాడన్నయ్యా" అంటూ మా చెల్లి గొంతు వినబడింది.

"దేనికిట ఆ తొందరా?" కాస్త విసుగ్గానే అన్నాను.

"ఏమో.... ఏం చెప్పలేదు మామయ్య."

"సర్లే, తొందరగా వస్తున్నానని చెప్పు మాధవీ!" అని అన్నానే కానీ, నాకు వేణ్ణీళ్ళ సుఖాన్ని వదులుకొని వెళ్ళాలని లేదు.

వెంకటేశ్వర్లు మామయ్య నాకు స్వయాన మేనమామ. అంటే మా అమ్మకు చివరి తమ్ముడన్న మాట. వయసులో నాకంటే ఏడెనిమిదేళ్ళు పెద్దయి వుంటాడు.

"పిచ్చి కాని పిచ్చి" మీద ఎవరైనా పరిశోధన చేయాల్సివస్తే - 'గళ్ళ నుడికట్టు' పిచ్చి ఉన్నవాళ్ళనీ తమ పరిశోధనలో చేర్చమని మనవి చేసుకుంటాను. సరిగ్గా అలాంటి పిచ్చి ఉన్నవాడు మా వెంకటేశ్వర్లు మామయ్య. ఆయన కీ పిచ్చి ఎప్పటినుంచి పట్టుకున్నదో ఇదమిత్థం చెప్పటం కష్టం. కానీ - పాతికేళ్ళ క్రితం 'ఆరుద్ర గళ్ళనుడికట్టు' తో ప్రారంభమై 'శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక' తో ముదిరిపోయి ఉంటుందని నా అనుమానం.

నిజానికి తెలుగులో మామయ్యకున్న పదజ్ఞానం తక్కువే, అయితే అతని మొండి పట్టుదల మాత్రం ఎవర్నయినా ఆశ్చర్యపరుస్తుంది. ఈ మధ్య ఆంధ్రప్రభ వీక్లీలో 'గడి - నుడి' ప్రారంభమైనప్పటి నుంచి - అందులోని ఏ ఒక్కపదం దొరక్కపోయినా నిద్రాహారాలు మాని దానికోసం ఆలోచించేవాడు. ఎప్పుడైనా జుట్టు కూడా పీక్కునేవాడు. (నాకూ గడి - నుడి పూరించడం ఇష్టమే కానీ, జుట్టు మాత్రం పీక్కోను.)

ఏ మధ్యాహ్నమో నేను భోంచేసి అలా నడుం వాలుస్తున్నట్టే - ఉన్నట్టుండి ఊడిపడతాడు మామయ్య. - "ఒరే భానూ! ఆ పత్రం తీగతో పాకితే కలుగుతుంది క్షోభ..." అంటాడు.

"ఎన్నక్షరాలు మావయ్యా?" అనేస్తాను.

"నాలుగక్షరాలుండాలిరా! అడ్డంలో 'ఆపద' వస్తుంది అంటే ఇది కూడా 'ఆ' తోనే మొదలవుతుందన్న మాట!" అంటాడు మామయ్య.

మామయ్య మాటలకి జవాబు ఇవ్వటం నా కెంత అలవాటై పోయిందంటే – ఓ ఆదివారం నాడు టీ.వీ.లో 'ఒన్ డే క్రికెట్' మ్యాచ్ చూస్తూ ఉన్నాను. "రాత్రంతా ఒకటే ఒళ్ళునొప్పులు. తెల్లవారుతున్నట్టే జ్వరం..." నన్ను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు మామయ్య.

'ఎన్నక్షరాలూ...అడ్డం నిలువు గళ్ళలో పదాలేవైనా దొరికాయా?" అన్నాను.

మా తమ్ముడూ, అమ్మా నవ్వుతున్నారు.

నా పరిస్థితి అర్థం చేసుకున్న మాధవి – "మామయ్యకి జ్వరం వచ్చిందట అన్నయ్యా!" అంటూ నొక్కి చెప్పేటప్పటికి నాకు నవ్వాగలేదు.

అపారమైన తెలివితేటలున్నవాళ్ళే అలా గళ్ళని పూరించగలరని ఆయనకు గొప్ప విశ్వాసం. ఏ పదమైనా దొరక్కుండా తన్ని ఇబ్బందిలో పడేసిందా – ఓ పెద్దగుట్ట పడేన్ని సిగరెట్టు పీకలూ, చిన్న సైజు దిబ్బంత బూడిదా టేబుల్‌మీద తయారై ఉంటాయి.

ఓ రోజు అర్ధరాత్రి తలుపులు 'ధనా ధనా' మంటూ శబ్దమవుతూంటే నాకు మెలకువ వచ్చేసింది. ఈలోగా మా నాన్న వెళ్ళి తలుపు తీశాడు. వెంకటేశ్వర్లు మామయ్య కనబడ్డంతోటే కంగారు పడిపోయాడు. వాళ్ళింట్లో ఎవరికైనా సీరియస్సుగా ఉందేమోనని అడిగాడు – అదేం లేదంటూ "సప్త సముద్రాల కవతల ఆచెట్టు తొర్రలోనే అతగాడి ప్రాణం. దొరికింది బావా. దొరికింది" అన్నాడు.

మా నాన్న నిద్రమత్తు సగం వదిలినట్లై – "ఒరే నా ప్రాణం తీయమాకు. ఆగదిలో భానుమూర్తిగాడున్నాడు వెళ్లు" అంటూ ఉంటే నాకు నవ్వొచ్చింది.

"ఒరే భానూ! లేరా – దొరికిందిలే..అతగాడి ప్రాణం! సప్త సముద్రాల కవతల...." అంటూ– ముసుగుతన్ని పడుకుని ఉన్న నా దుప్పటిని లాగి "మనం నిన్నంతా దాని కోసం ఎంత తన్నుకొని చచ్చాం. చివరికి 'రామచిలుకలోన' అని పూరించాం. అందుకే తక్కిన గళ్ళు పూరించలేకపోయాం...ఇప్పుడు దొరికిందిరోయ్!"

"అబ్బా! అదేమిటో చెప్పు మామయ్యా! అనవసర సస్పెన్సూ, థ్రిల్లూ ఎందుగ్గానీ" అంటూ విసుక్కుని దుప్పట్ని గొంతువరకూ కప్పుకున్నాను.

"తొందరపడకొరే –అతగాడి ప్రాణం – అంటే రాక్షసుడి ప్రాణం' ...ఇప్పుడు రెండవ గడిలో 'రాఘవుడే.', మూడోగడిలో 'సుర' నాల్గవ గడిలో 'ప్రాణదానం'... సరిపోతాయి" అంటూనే ఇక తన కర్తవ్యం అయిపోయినట్లు నా దుప్పట్లో దూరేసి పడుకున్నదే తడవుగా గుర్రుపెట్టి నిద్రపోయాడు.

అత్తయ్యమీద ఆ క్షణంలో జాలేసింది నాకు. అత్తయ్యంటే జ్ఞాపకమొచ్చింది. కొన్నాళ్ళ కిందటి మాట. మామయ్య పెళ్ళి జరుగుతోంది.. అత్తయ్య సిగ్గుతో తల వంచుకుని పీటల మీద కూచుని ఉంది. అప్పుడప్పుడు ఓరకంట చూస్తోంది – తెల్లటి తలపాగాతో బాసికం కట్టుకుని ఎంతో అందంగా ఉన్న మా మామయ్య

వంక. అయితే మామయ్యకి ఓర చూపులూ, కోరచూపులూ అలవాటు లేకనో, మరి ఎంచేతనో దూరంగా పందిరి కవతల ఉన్న జనంకేసి చూస్తూ ఉన్నాడు. పురోహితుడు మంత్రాలు ఏకధాటిగా చదువుతున్నాడు.

సరిగ్గా అప్పుడు -

మామయ్య ఏదో అన్నట్టయితే పురోహితుడు మంత్రాలు చదవడం ఆపేసి అడిగాడు - "ఏమిటి బాబూ, ఏం కావాలి?"

"ఆఁ ఏం లేదు...ప్రతి పెళ్ళిలోనూ సజీవమైన టేప్ రికార్డరు ఏమిటా అని మూడు రోజుల్నించి ఆలోచిస్తూ ఉన్నా...ఇప్పుడు దొరికింది."

"ఆఁ..టేప్‌రికార్డరు దొరికిందా? ఎప్పుడు.. ఏదీ?"

"ఇప్పుడే ..మీరే..ప్రతి పెళ్ళిలోనూ సజీవమైన టేప్ రికార్డరు మీరే. మంత్రాలన్నీ ప్రతి పెళ్ళిలోనూ టేప్‌చేసినట్లు ఒక్కటే వినిపిస్తారు... మీరే, అంటే 'పురోహితుడు'... అప్పుడు అయిదు నిలువు 'రోహిణి' . ఏడు నిలువు తుగ్లక్" అంటూ తక్కిన గళ్ళన్నీ కళ్ళెదుటే ఉన్నట్టు టపీటపీమని పూరిస్తోంటే పురోహితుడు మంత్రాలు మరచి, నోరు తెరిచి అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆ సమయంలో అక్కడే నవ్వలేక పందిట్లోంచి బయటికి పరిగెత్తుకెళ్ళి ఓ అరగంట నవ్వాను.

ఏది ఏమైనా మామయ్యలో మట్టుకు ఓ విషయంలో మా చెడ్డ సిన్సియారిటీ ఉంది. అదేంటంటే గొప్ప ప్రేమలో పడ్డ ప్రేమికుడు వందమంది అమ్మాయిల్లోనూ తన ప్రియురాలిని తప్ప మరొక్కరిని ఎలా చూడడో, అలాగే తను కొన్న పత్రికలో కథలున్నా, కవితలున్నా సీరియల్సున్నా వేటినీ చూడకుండా ఒక్క 'గడి - నుడి' నే చూస్తాడు.

ఇన్ని అనుభవాల్లోనూ ఒక్క అపశ్రుతి...ఒక్కసారన్నా 'గడి - నుడి ఆల్ కరెక్టు కాకపోవడం. అయినా పట్టు వదలని విక్రమార్కుడు మా వెంకటేశ్వర్లు మామయ్య.

"ఒరే భానూ, ఇంకెంత సేపూ నీ స్నానం?" అంటూ మామయ్య గొంతే వినబడేసరికి నా సుఖానికీ, ఆలోచనలకీ ఫుల్‌స్టాప్ పెట్టేసి టవల్ తీసుకున్నాను - వస్తున్నా మామయ్యా" అంటూ.

రెండు నిముషాల్లో బయట గదిలోకి చేరుకున్నాను.

తలకున్న తడిని రుద్దేస్తూ అడిగాను "ఏం మామయ్యా! మరో 'గడి - నుడా?"

"అదేంకాదు కానీ...మనం సక్సెస్‌రోయ్ భానుమూర్తీ" అంటూ మామయ్య చిర్నవ్వు చిందించాడు.

"దేంట్లో మామయ్యా - గడి - నుడిలోనే?"

"ఆఁ మరేమనుకున్నావ్?" అంటూనే అందాకా చేతిలో ఉన్న వీక్లీని టక టక పేజీలు తిరగేసి ఆత్రంగా చూపించాడు. - 'గడి-నుడి' ఫలితాన్ని. సరియైన సమాధానాలు రాసిన వారి పేర్లంటూ ఓ పాతికమంది పేర్లున్నాయక్కడ. ఎర్ర సిరాతో అండర్‌లైన్ చేసున్న 'పి. వెంకటేశ్వర్లు, అనంతపురం' ను చూపి గర్వంగా నా వేపు చూశాడు మామయ్య.

"కంగ్రాచ్యులేషన్సు మామయ్యా!"

"ఇన్నాళ్ళకి ఫలించిందిరోయ్ నా కోర్కె! ఇంకా మీ అత్తయ్యకి తెలీదు. తెలిస్తే ఇంకేమన్నా ఉందా - మా వీధి వీధంతా తెలిసేట్టు ప్రచారం చేసెయ్యదూ? - మా ఆఫీసులో ఇంక ఊరికే వదుల్తారా? టీ పార్టీ అడిగినా అడుగుతారు" అంటూ చెప్పుకుపోతూ ఉంటే - మా తమ్ముడు చక్రవర్తీ, మాధవీ వింతగా చూస్తూ నన్నడిగారు. నేను టూకీగా వివరిస్తోంటే మామయ్య సంతోషం అలివికాకుండా ఉంది.

"ఒరేయ్! వెళ్ళొస్తా. ఇంకా నాకు వేరే పనులున్నాయి" అంటూ గబ గబ చెప్పేసి వెళ్ళిపోయాడు మామయ్య.

ఇన్నాళ్ళకైనా మామయ్య పేరు పత్రికలో వచ్చినందుకు నిజంగా నాకు భలే సంతోషం కలిగింది.

"మామయ్యను చూస్తే జాలేస్తోంది" అన్నాడు చక్రవర్తి.

"ఏం, ఎందుకు?" అన్నాను.

'గడి-నుడి' పూరించి, పోస్టు చేయమని మూడువారాల క్రితం నా చేతికిచ్చాడు మామయ్య. నేనేమో మరిచిపోయానన్నయ్యా! ఇప్పుడే రేడియో పక్కన వెతికితే దొరికింది - అది ఇది" అంటూ 'గడి-నుడి' కటింగ్‌ను ఇచ్చాడు చక్రవర్తి.

"నిజమే ! అదే!

"మరి మామయ్య పేరు ఎలా వచ్చిందిరా వీక్లీలో?" అన్నాను విస్తుపోతూ.

"పి. వెంకటేశ్వర్లు అనే పేరున్న మహానుభావుడెవరో రాసి పంపి వుంటా దన్నయ్యా." అంది మాధవి.

"ఈ విషయం మామయ్యకి చెప్పకండి. ఇది మన ముగ్గుర్లోనే ఉండిపోనీ... ఆయన సంతోషాన్ని ఎందుకు - చెడగొట్టడం" అన్నాను మామయ్యని ఊహించుకుంటూ.

(ఆంధ్రప్రభ వీక్లీ - 16 మార్చి, 1988)